క్లుప్తంగా

వైద్యులపై దాడులు అమానుషం

అమలాపురం టౌన్: ఇటీవల కాలంలో వైద్యులు, ఆసుపత్రులపై జరుగుతున్న దాడులు అమానుషమని జిల్లా బీజేపీ మెడికల్ విభాగం కన్వీనర్ కాళ్లకూరి గోపీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రావులపాలెంలోని ఓ నర్సింగ్ హోమ్ వైద్యుడిపై, సదరు ఆస్పత్రిపై ఒక రోగి బంధువులు దాడి చేయడం అన్యాయమన్నారు. రావులపాలెం ఆస్పత్రిపై దాడి చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలకు సత్కారం



పీఈటీలను సత్కరిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్ల కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న పీఈటీలు పరమట విష్ణుప్రసాద్, మంగిపూడి శ్రీనివాస్‌లను ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్ల జిల్లా కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు సాదా రామకృష్ణ, జనరల్ సెక్రటరీ ఎ.సత్యనారాయణ, ట్రెజరర్ పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్, జనుపల్లి అశోక్‌బాబు, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సాయం



హరికృష్ణకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాట్రేనికోన: ఇటీవల గచ్చకాయలపోరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అవనిగడ్డ హరికృష్ణకు ప్రజాసేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గచ్చకాయలపోర గ్రామ పెద్దలు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా వాయిదా

అమలాపురం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన అమలాపురంలో నిర్వహించాలనుకున్న మెగా జాబ్ మేళాను భారీవర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. తదుపరి జాబ్ మేళా తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 82476 45389 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడాకారిణి బిందుశ్రీకి సత్కారం



బిందుశ్రీని సత్కరించిన క్లబ్ కార్యదర్శి సుమన్, కోచ్ శ్రీను

యానాం: స్పోర్ట్స్ కోటాలో తమిళనాడులోని పీఎస్ఎన్ఏ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో ఉచిత సీటు సంపాదించిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి బిందుశ్రీని యానాం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్ మాట్లాడుతూ బిందుశ్రీకి స్పోర్ట్స్ కోటాలో సీటు రావడం క్లబ్‌కు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కోచ్ బొట్టా శ్రీనివాస్, రాయపురెడ్డి విజయ, పెనుమత్స అజయ్, రెడ్డి లోవనరేష్, వీరబాబు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

సరైన సమయంలో జవాబిస్తా

యానాం: రీజెన్సీ ఫ్యాక్టరీ తరలింపు, సంస్థ బకాయిలపై పరిష్కార మార్గాల గురించి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై సరైన సమయంలో స్పందిస్తానని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు ఆదివారం పేర్కొన్నారు. 1986లో రీజెన్సీ పరిశ్రమ ప్రారంభమైనప్పటి నుంచి యానాంలోనే ఉన్నానని, ఈ నేపథ్యంలో ప్రజల యోగక్షేమాలు చూడటంలో, వారిని కష్టకాలంలో ఆదుకోవడంలో తన వంతు పాత్ర పోషించానన్నారు. తన నిజాయతీని తెలియజెప్పేందుకు ప్రజలందరి సమక్షంలో సరైన సమయంలో స్పందిస్తానన్నారు.

పీడీఎస్‌యూ నాయకునికి మంత్రి సుభాష్ పరామర్శ

అమలాపురం టౌన్: కిడ్నీలో రాళ్ల సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పరామర్శించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని తిరుపతిరావు ఇంటికి మంత్రి సుభాష్ వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



ముమ్మిడివరంలో వినాయక చవితికి ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు



ముమ్మిడివరంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



అమలాపురం భూపయ్య అగ్రహారంలోని లక్ష్మీగణపతి ఆలయంలో జరుగుతున్న లక్ష చామంతి, లడ్డూల పూజలు



ఈదరపల్లిలో నిర్వహించిన కోలాట ప్రదర్శన



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో గణపతికి గరిక పూజ చేస్తున్న పండితులు

విఘ్నాలు దాటించు గణనాథా

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు
- వాడవాడలా చలువ పందిళ్లతో సందడి

అమలాపురం టౌన్: వినాయక నవరాత్ర ఉత్సవాలు అమలాపురం పట్టణంలో పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటైన చలువ పందిళ్లలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత పురోహితులు ఆయా పందిళ్లలో పూజలు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. పట్టణంలో దాదాపు 45 చోట్ల చవితి చలువ పందిళ్లు ఏర్పాటయ్యాయి. గడియారం స్తంభం సెంటర్, ముమ్మిడివరం గేటు సెంటర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో వెలిసిన చలువ పందిళ్లను భారీ ఎత్తున తీర్చిదిద్దారు. నారాయణపేట, గోఖలే సెంటర్, సూర్యనగర్, విత్తనాల వారి కాల్వగట్టు, దుడ్డివారి అగ్రహారం, నల్లా వీధి, మహిపాల వీధి, రవణం మల్లయ్య వీధి, రవణం వీధి, గారపాటి వారి వీధి, కల్వకొలను వీధి, కొంకాపల్లి తదితర ప్రాంతాల్లో వినాయక పందిళ్లు వెలిశాయి. గడియారం స్తంభం సెంటరు, కాలేజీ రోడ్డు, కొంకాపల్లి, అన్నాబత్తులవారి వీధి, నారాయణపేట, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయాల్లో కూడా చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ విత్తనాల వారి కాల్వగట్టు, దుడ్డివారి అగ్రహారంలో ఏర్పాటైన వినాయక చలువ పందిళ్లను ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పందిళ్లలో అడుగు నుంచి ఆరు అడుగులు ఎత్తులో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ముమ్మిడివరం గేటు సెంటరు వద్ద వెలిసిన షరాబుల చలువ పందిరిని సినిమా సెట్టింగ్‌లను తలపించేలా అలంకరించారు. షరాబుల పందిరిలో శనివారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం బాలలను సత్కరించారు.

గణనాథునికి లక్ష చామంతి పూజ

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా భక్తులు లక్ష చామంతి పూజ చేశారు. అలాగే పది వేల లడ్డూలతో అభిషేకం చేశారు. చవితి సందర్భంగా ఆలయాన్ని వందలాది మంది భక్తులు సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి అర్చక స్వాములు మంత్ర పుష్పం, ధూప దీప హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. పేరి కొండబాబు సోదరుల ఆధ్వర్యంలో భక్తులకు పలు సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు.



యానాం పాతబస్టాండ్‌లో నెలకొల్పిన గణనాథుని విగ్రహం



సినిమా సెట్టింగ్‌లను తలపించేలా అలంకరించిన అమలాపురం షరాబుల చవితి చలువ పందిరి

బ్రహ్మోత్సవాల ప్రారంభం

యానాం: స్థానిక పిల్లారాయ వీధిలో కొలువైన శ్రీపిళ్లెయ్యార్ స్వామి(లక్ష్మీగణపతి) వారి బ్రహ్మోత్సవాలు సైతం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉత్సవదారులుగా స్వామి రథోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి కాపు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హంస వాహనోత్సవం ఘనంగా జరిగింది. అంతకుముందు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ గణనాథుని మండపాన్ని ఏర్పాటుచేశారు. తోటవారివీధి, కనకాలపేట, ఓల్డ్‌రాజీవ్‌నగర్, బైపాస్ రహదారి, గురు కృష్ణాపురం, మెట్టకూరు, చిన్నాసెంటర్, ట్యాక్సీ స్టాండ్ వద్ద, రమాబాయినగర్ తదితర ప్రాంతాల్లో గణనాథుని మండపాల్లో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు.

వాడవాడలా చవితి వేడుకలు

తాళ్లరేవు: వినాయక చవితి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ప్రముఖ వినాయక ఆలయాలతో పాటు వాడవాడలా ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలను, మండపాలను వివిధ రకాల పువ్వులు, ఆకులతో పాటు రంగురంగుల తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. విఘ్నేశ్వరుడిని భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. స్వామివారికి ఉండ్రాళ్లు, కుడుములు, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో అర్చకులు కోనంభట్ల సత్తిబాబుశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

గడప గడపలో గణపయ్య

ఐ.పోలవరం: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఇంటింటా గణపయ్యకు పూజలు చేశారు. మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని టి.కొత్తపల్లి, జి.వేమవరం, పశువుల్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, పాతయింజరం, కొమరగిరి, గుత్తినదీవి, జి.మూలపొలం, భైరవపాలెం, గోగుల్లంక తదితర గ్రామాల్లో చవితి ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. పలు ఆలయాల్లో భారీ అన్న సమారాధనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో కొలువైన గణపతికి లక్ష గరిక పూజా మహోత్సవం నిర్వహించారు.

కొలువుదీరిన అయోధ్య గణపతి

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక మట్టపర్తివారి పాలెంలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక పందిరిలో 16వ వార్షికోత్సవం సందర్భంగా కడలిరాజు, దుర్గాభవాని దంపతులచే కలశ స్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కొలువుదీరిన అయోధ్య గణపతి విగ్రహం అందరినీ ఆకర్షించింది. భక్తులు అధిక సంఖ్యలో వినాయక మండపాలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బండారులంక చినచంద్రాపురంలో శ్వేతవర్ణ లక్ష్మీగణపతి ఆలయం 79వ వార్షికోత్సవ చవితి ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈదరపల్లిలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ లయబద్ధంగా నృత్యం చేస్తూ చేసిన ప్రదర్శన భక్తులు ఆసక్తిగా తిలకించారు.



బండారులంకలోని వరసిద్ధి వినాయక పందిరిలో పూజలు చేస్తున్న భక్తులు



తాళ్లరేవులో ఏర్పాటుచేసిన వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం: స్థానిక బళ్ల గేటు సెంటర్ త్రిముఖ గణపతి ఆలయం, మార్కెట్ సెంటర్ శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, పోలీస్‌స్టేషన్ సెంటర్ విజయదుర్గా ఆలయాలతో పాటు కొమానపల్లి, గేదెల్లంక, గాడిలంక, అయినాపురం తదితర గ్రామాల్లో గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముమ్మిడివరం త్రిముఖ గణపతి ఆలయం వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పేరంటాలమ్మ ఊరేగింపు



పేరంటాలమ్మ కావిడిలను తీసుకెళుతున్న భక్తులు



విశేష అలంకరణలో పేరంటాలమ్మ

యానాం: నియోజకవర్గ పరిధిలో పరంపేట గ్రామంలో కొలువైన వందలాది ఏళ్ల చరిత్ర కలిగిన పేరంటాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం వినాయకచవితి రోజున పురవీధుల్లో పేరంటాలమ్మను ఊరేగించారు. ఈ సందర్భంగా సంప్రదాయకంగా వస్తున్న పేరంటాలమ్మ అమ్మవారి కావిడిలను మోస్తూ భక్తులు పరంపేట నుంచి యానాం పట్టణం, నీలపల్లి, జార్జిపేట, కురసాంపేట తదితర ప్రాంతాల మీదుగా మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సాగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గిడ్డి సత్యనారాయణ, గెద్దం అప్పారావు, పోతుల శివ, నల్లా గణపతి, నీతిపూడి మీరాసాహెబ్, యువజన, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాల కోసం ఉత్సవ కమిటీ ప్రతినిధులు పందిరి రాట ముహూర్తాన్ని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఉదయం 7.09 గంటలకు కమిటీ ప్రతినిధులు, భక్తులు ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. తొలుత పందిరి రాటకు పురోహితులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, ఆకుల ఏడుకొండలు, సలాది గోవింద్, గంగాబత్తుల బుజ్జి, ఆశెట్టి శ్రీను, ఆకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో డీఎస్పీ పరిశీలన




పల్లంకుర్రు బూలవారిమొండి వద్ద బలహీనంగా ఉన్న గట్టును పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

కాట్రేనికోన: గోదావరికి వరద నీరు పోటెత్తడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం పర్యటించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలైన పల్లంకుర్రు బూలవారి మొండి, నడవపల్లి పత్తిగొంది, కుండలేశ్వరం పుష్కరఘాట్ వద్ద గట్టు దిగబడిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాట్రేనికోన ఎస్ఐ అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు: మండలంలోని ఇంజరం కేవీఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ట్రస్ట్ ప్రతినిధులు కాకరపర్తి వెంకట్రావు, పూర్ణిమ దంపతులు ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యులు శ్రీవల్లీ నేతృత్వంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలున్న సుమారు 120 మందికి కళ్లజోళ్లను అందిస్తామని, శస్త్ర చికిత్సలు అవసరమైన 40 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని ట్రస్ట్ ప్రతినిధి కాకరపర్తి వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఆకెళ్ల నాగేశ్వరరావు, కిరణ్ కంటి ఆస్పత్రి పీఆర్ఓ సత్యనారాయణ, ట్రస్ట్ ఆస్పత్రి హెచ్ఆర్ మేనేజర్ ఓఆర్ ప్రసాద్, సూపరింటెండెంట్ మహాలక్ష్మి, కాకరపర్తి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇంజరంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వినాయక విగ్రహాలకు ఫీజులను నిరసిస్తూ ధర్నా



అమలాపురంలో ధర్నా చేస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నవరాత్ర పందిళ్లలో నెలకొల్పే విగ్రహాల సైజులను బట్టి చలానాల రూపంలో ఫీజులు చెల్లించాలన్న ప్రభుత్వ విధానంపై విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ ప్రతినిధులు అమలాపురంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని చవితి చలువ పందిరి వద్ద వారు ఆదివారం ధర్నా చేశారు. విగ్రహాలకు సైజ్‌లను బట్టి చలానాల పేరుతో ఫీజులు వసూలు చేయాలన్న నిర్ణయం ఈ ప్రభుత్వంలోనే చూశామని బజరంగ్‌దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు అన్నారు. వినాయక చవితి ఉత్సవ నిర్వాహకుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయడం లేదని చెబుతున్న ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలోని పలు పందిళ్లు, ఉత్సవ కమిటీల నుంచి వసూలు చేసిన సొమ్మును తిరిగి వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోటి మాటగా చెప్పడం కాదని, నిర్ణయాన్ని పూర్తిగా వెనక్కి తీసుకున్నట్లు లిఖిత పూర్వకమైన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయాలని సూచించారు.

'ఆయ్' చిత్ర దర్శకుడు అంజిబాబుకు సత్కారం



దర్శకుడు అంజిబాబును సత్కరిస్తున్న రమా థియేటర్ సిబ్బంది

అమలాపురం టౌన్: ఆయ్ చిత్ర దర్శకుడు కంచిపల్లి అంజిబాబు సదరు చిత్రాన్ని ప్రదర్శిస్తున్న రమా థియేటర్‌కు శనివారం రాత్రి వచ్చి కొద్దిసేపు సినిమాను వీక్షించారు. థియేటర్ యాజమాన్యం, సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు అంజిబాబు మాట్లాడుతూ తన తొలి చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ కేతా వీరబాబా, సినిమా ఏజెంట్ ముని, సిబ్బంది అక్కిన సురేంద్ర, నిమ్మకాయల సురేష్, కొప్పిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై సీఎం సమావేశం

యానాం: యానాంకు సంబంధించి దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై శనివారం పుదుచ్చేరిలో వివిధ శాఖల మంత్రులతో సీఎం రంగసామి సమావేశం నిర్వహించినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న తాను విద్యాశాఖకు సంబంధించి పారాటీచర్లుగా పనిచేసిన 30 మంది సర్వీసులను పొడిగించాలని, పీడబ్ల్యూడీలో పనిచేస్తున్నవారిని రెగ్యులర్ చేయాలని కోరానన్నారు. సెంట్రల్ కిచెన్‌లో, ట్రాన్స్‌పోర్టులో, స్పోర్ట్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలపై చర్చించానన్నారు. 5,289 మంది మత్స్యకారులకు 9 నెలల పరిహారం సొమ్మును ఈ నెల 15వ తేదీలోగా ఓఎన్‌జీసీ సంస్థ పుదుచ్చేరి ప్రభుత్వానికి డిపాజిట్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రీజెన్సీ ఫ్యాక్టరీకి సంబంధించి సమస్యలపై సీఎం రంగసామితో చర్చించినట్లు తెలిపారు.

రేషన్‌కార్డుల్లో మృతుల పేర్లు తొలగించుకోవాలి

యానాం: మృతి చెందినవారి పేర్లు ఎవరి రేషన్‌కార్డుల్లోనైనా కొనసాగుతుంటే నెల రోజుల్లోపు తొలగించుకోవాలని పుదుచ్చేరి సివిల్ సప్లయిస్ శాఖ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అత్యధిక సంఖ్యలో మృతుల పేర్లు రేషన్ కార్డుల్లో ఉంటున్నాయని, దీనివల్ల సబ్సిడీ పంపిణీలో అనవసరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దీనిపై స్పష్టత కోసం ×పీడీఎస్ఎస్‌డబ్ల్యూ.పీవై.జీఓవీ.ఇన్‌× వెబ్‌సైట్‌లో పేర్లను పరిశీలించుకోవాలన్నారు. మృతుల పేర్లను తొలగించకపోతే రేషన్‌కార్డు డేటాబేస్‌ను బ్లాక్ చేయడమే కాకుండా సబ్సిడీ సైతం నిలిపివేస్తామన్నారు.

ఘనంగా లూర్దుమాత మహోత్సవం

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌లో కొలువైన లూర్దుమాత మహోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సామర్లకోట ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సేనాపతి పీటర్, ఫాదర్ మరియదాసుల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. లూర్దుమాత కొండగుడిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని కొద్దిరోజులుగా చేస్తున్న ఉపవాస ప్రార్థనలు ముగిశాయి. కార్యక్రమానికి యానాం, తాళ్లరేవు, కాజులూరు తదితర మండలాలకు చెందిన క్రైస్తవులు, గ్రామస్తులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



లూర్దుమాత మహోత్సవంలో భక్తుల ప్రార్థనలు

పెంకుటిల్లు దగ్ధం

తాళ్లరేవు: జార్జిపేట గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించి రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఆ గ్రామానికి చెందిన ఇంధన సాయి, సూర్యనారాయణ కుటుంబాలు ఓ పెంకుటింట్లో నివసిస్తున్నాయి. అయితే ఉదయం 11 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఇంట్లోంచి మంటలు ఎగసిపడ్డాయి. అది గమనించిన ఇంట్లో వారంతా ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతోపాటు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అందరూ చూస్తుండగానే మంటలు భారీ ఎత్తున వ్యాపించడంతో ఇంట్లో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ఆ రెండు కుటుంబాలూ కట్టుబట్టలతో మిగిలాయి. యానాం అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.



ప్రమాదంలో కాలిబూడిదైన ఇంట్లోని వస్తువులు

వరద బాధితులకు విద్యార్థుల సాయం



బాధితులకు సామగ్రి వితరణ చేస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సమనస గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు సుమారు రూ.35 వేల విలువైన సామగ్రి వితరణ చేశారు. విజయవాడలోని ముంపు బారిన పడిన కండ్రిగ, రాజేశ్వరి నగర్, సింగ్ నగర్, పాయకరావుపేట తదితర వరద బాధిత ప్రాంతాల్లో బాధితులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లతో పాటు పాత చీరలు, దుప్పట్లు అందజేశారు.